# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 06-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లోని కర్తవ్య భవనాన్ని ఈరోజు ప్రారంభించి జాతికి అంకితం చేశారు.
- ❖ అశ్లీల కంటెంట్‌ను ప్రదర్శించినందుకు గానూ 43 ఓటీటీ ప్లాట్ ఫామ్స్ ను నిషేదించామని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.
- ❖ బీహార్ ఎన్నికల జాబితాలో చేపట్టిన ఎస్ఐఆర్ సవరణలపై విపక్షాల నిరసనలతో పార్లమెంట్ ఉభయ సభలు రేపటి వాయిదాపడ్డాయి.
- ❖ ఉత్తరాఖండ్ లో నిన్న ఆకస్మిక వరదలు సంభవించిన ధరాలి ప్రాంతంలో సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి.
- ❖ హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కైలాష్ మానస్ సరోవర్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశాయి.

==============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూ డిల్లోని సెంట్రల్ విస్టా విస్తరణలో భాగంగా నిర్మించిన కర్తవ్య భవనాన్ని ఈరోజు ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ప్రజాసేవ పట్ల దృఢసంకల్పానికి, నిరంతర కృషికి ఈ భవనం ఒక ప్రతీక అని ప్రధానమంత్రి ఈ సందర్భంగా అభివర్ణించారు. విధానాలు, పథకాలను త్వరితగతిన అమలుపరచడంలో కర్తవ్య భవన్ సహాయపడడంతో పాటు దేశాభివృద్ధికి సరికొత్త ఉత్సాహాన్ని కూడా అందిస్తుందని చెప్పారు. స్వయంసమృద్ధ భారత్‌ను ఆవిష్కరించాలన్న ప్రభుత్వ నిబద్ధతను కర్తవ్య భవన్ చాటిచెబుతోందని నరేంద్ర మోదీ వ్యాఖ్యానిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==============================

అశ్లీల కంటెంట్‌ను ప్రదర్శించినందుకు గానూ 43 OTT ప్లాట్ ఫామ్స్ ను నిషేదించామని కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. లోక్‌సభలో ఈరోజు ఆయన ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధాన మిస్తూ హానికరమైన కంటెంట్ ప్రతికూల ప్రభావాలను నిరోధించేందుకు OTT ప్లాట్ ఫామ్స్ పై ప్రభుత్వం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్ (2021) చట్టాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు.నిబంధనల ప్రకారం, OTT ప్లాట్ ఫామ్స్ ఈ చట్టం ద్వారా నిషేధించబడిన ఏ కంటెంట్‌ను కూడా ప్రసారం చేయకూడదని స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్ లోని ఉత్తరకాశీ జిల్లాలో నిన్న ఆకస్మిక వరదలు సంభవించిన ధరాలి ప్రాంతంలో సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. భారత సైన్యం, ఎన్డీఆర్ఎఫ్ ఎస్డీఆర్ఎఫ్, ఇతర బృందాలు ఈ సహాయక చర్యలలో భాగమయ్యాయి. బాధితులకు తక్షణ సహాయం అందించడానికి సహాయక శిబిరాల్లో ఆహారం, మంచి నీరు, ఔషదాలను అందుబాటులో ఉంచారు. భట్వారీ ప్రాంతంలో రహదారులు దెబ్బతిన్న కారణంగా ఇతరప్రాంతాలతో అనుసంధానం లేకపోవడంతో ఆ ప్రాంతంలో విరిగిపడిన కొండచరియలను ముమ్మరంగా తొలగిస్తున్నారు. ఇక మరోవైపు ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఈరోజు విపత్తు ప్రభావిత ప్రాంతాలలో విహంగా వీక్షణం చేశారు. ఉత్తరకాశీలోని విపత్తు నిర్వహణ, సహాయ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బీహార్ ఎన్నికల జాబితాలో చేపట్టిన ఎస్ఐఆర్ సవరణలపై విపక్షాల నిరసనలతో పార్లమెంట్ ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అంశంతో పాటూ ఇతర అంశాలపై ప్రతిపక్షాలు ఈరోజు పార్లమెంటు ఉభయ సభల కార్యకలాపాలకు అంతరాయం కలిగించాయి. వీటి ఫలితంగా లోక్‌సభ, రాజ్యసభ రేపటికి వాయిదా పడ్డాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వరదలు సంభవిస్తున్నాయి. దీంతో అప్రమత్తమైన ఉభయ రాష్ట్రాలు కైలాష్ మానస్ సరోవర్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశాయి. ఈ భారీ వర్షాల కారణంగా కిన్నౌర్ జిల్లాలో కైలాస్ యాత్ర ట్రెక్కింగ్ మార్గంలో వందలాది మంది యాత్రికులు వరదల్లో చిక్కుకుపోయారు. వెంటనే స్పందించిన ఐటీబీపీ సిబ్బంది 413 మంది యాత్రికులను రక్షించారు. వరదల ధాటికి ట్రెక్కింగ్ మార్గాలు ధ్వంసం కావడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా కిన్నౌర్ కైలాష్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ద్రవ్య విధాన కమిటీ, రెపో రేటును 5.5 శాతం వద్ద యథాతథంగా కొనసాగించింది.దీంతో స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటు 5.25 శాతంగానూ, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ రేటు 5.75 శాతంగా ఉండనున్నాయి. భారత దిగుమతులపై అమెరికా సుంకాలు విధించినప్పటికీ, RBI 2025-26 ఆర్థిక సంవత్సరం GDP వృద్ధి అంచనాను 6.5 శాతంగానే పేర్కొంది. ఈ సంవత్సరానికి ద్రవ్యోల్బణం 3.1 శాతంగా ఉంటుందని అంచనా వేసింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రైల్వే ప్రయాణికులు కేవలం 45 పైసల ప్రీమియంతో ప్రయాణ బీమా సదుపాయం పొందవచ్చని రైల్వే శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. రైల్వే బీమా సదుపాయానికి సంబంధించి లోక్ సభలో ఈరోజు సభ్యులు అడిగిన పలు

ప్రశ్నలకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ప్రయాణికులు ఆన్‌లైన్ లేదా రిజర్వేషన్ కౌంటర్ల వద్ద తీసుకునే టికెట్‌లో ఈ ఆప్షనల్ ట్రావెల్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను ఎంపిక చేసుకోవచ్చన్నారు. ఈ బీమా పథకం ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకున్న కన్ఫర్మ్‌డ్ లేదా RAC ప్రయాణికులకు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. ఈ బీమా ప్రయోజనం పొందాలనుకునే వారు టికెట్ బుకింగ్ సమయంలో ఆప్షన్‌ను స్వయంగా ఎంపిక చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ ఆప్షనల్ ట్రావెల్ ఇన్సూరెన్స్ పథకం కింద గత 5 సంవత్సరాల్లో మొత్తం 333 బీమా క్లెయిమ్స్ పరిష్కరించామని 27.22 కోట్ల రూపాయలను ప్రయాణికుల కుటుంబ సభ్యులకు బీమా సంస్థలు చెల్లించాయని వెల్లడించారు

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పంజాబ్ మొహాలీలోని ఒక ఆక్సిజన్ ప్లాంట్‌లో ఈరోజు ఉదయం భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా మరికొంత మంది తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికంగా ఫేజ్ 9లో ఉన్న ఫ్యాక్టరీలో ఈ పేలుడు ఘటన చోటు చేసుకుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. వైద్య, అగ్నిమాపక, రెస్క్యూ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపడుతున్నాయి. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఆక్సిజన్ ప్లాంట్‌లో ఎక్కువ సిబ్బంది ఉండడంతో ప్రాణనష్టం మరింత పెరిగే అవకాశం ఉందని పోలీసులుతెలిపారు. క్షతగాత్రులను ఫేజ్ 6 సివిల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా నుంచి 65 లక్షల మంది ఓటర్లను తొలగించామని పేర్కొంటూ ఎన్నికల సంఘం ఇటీవల విడుదల చేసిన ముసాయిదా ని సవాల్ చేస్తూ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ అనే ఎన్‌జీవో సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది. దీనిపై ఈరోజు విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం తాజాగా తొలగించిన ఆ 65 లక్షల ఓటర్ల వివరాలను సమర్పించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఇందుకోసం ఈనెల 9 వరకు గడువు ఇచ్చింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

డిజిటల్ పరివర్తనలో భాగంగా భారత తపాలా శాఖ దేశవ్యాప్తంగా అడ్వాన్స్డ్ పోస్టల్ టెక్నాలజీ (ఏపీటీ)ని విస్తృతంగా అమలు చేస్తోంది. సంప్రదాయ విధానాల నుంచి వేగవంతమైన, అంతరాయం లేని పోస్టల్ సేవల దిశగా తపాలా శాఖ పయనిస్తోంది. పట్టణ, గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో దాదాపు లక్ష 64 వేలకు పైగా పోస్టాఫీసుల్లో ఈ కీలక మార్పులను రెండు రోజుల క్రితం ప్రవేశపెట్టారు. విస్తృత స్థాయి మార్పులు, సంక్లిష్టతల కారణంగా తొలి రోజు కొంత ఒత్తిడి ఏర్పడిందని, అయితే సాంకేతిక బృందం త్వరిత గతిన ఆ సమస్యను పరిష్కరించిందని భారత తపాలా శాఖ ఈరోజు ఒక ప్రకటనలో పేర్కొంది. వేగవంతమైన లావాదేవీలు, డిజిటల్ చెల్లింపుల సమన్వయం, రియల్ టైమ్ ట్రాకింగ్‌తో పాటు మొత్తం వినియోగదారుల అనుభవాన్ని ఏపీటీ వ్యవస్థ గణనీయంగా మెరుగుపరుస్తోందని ఇండియా పోస్ట్ స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎం.ఎస్. స్వామినాథన్ శతాబ్ది జయంతిని పురస్కరించుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంతర్జాతీయ సదస్సుని న్యూఢిల్లీలోని ఐసీఏఆర్ పూసాలో రేపు ప్రారంభించనున్నారు. పచ్చదనం అంతరించిపోకుండా చూడడానికి ఎప్పుడూ పాటుపడుతూ ఉందాం అనే సిద్ధాంతం ఆధారంగా విస్తృత కార్యాచరణ చేపట్టడంపై చర్చించడానికి శాస్త్రవేత్తలకు, విధాన రూపకర్తలకు, అభివృద్ధి రంగ నిపుణులకు ఈ సదస్సు ఒక వేదికగా నిలుస్తుంది. ఎం.ఎస్.స్వామినాథన్ అడుగుజాడల్లో ఆహారం, శాంతి రంగాల్లో విశేషంగా కృషి చేస్తున్న వారికి ఎం.ఎస్. స్వామినాథన్ పేరిట పురస్కారాన్ని ప్రదానం చేయడాన్ని రేపు ప్రారంభించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =